క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పొన్నూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని కోరారు.

వట్టిచెరుకూరు ఎస్ఐగా డి.బాబూరావు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు ఎస్ఐగా డి.బాబూరావు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా వట్టిచెరుకూరు పోలీస్ స్టేషనులో ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు బాబూరావును వట్టిచెరుకూరు పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయన ఇక్కడ విధుల్లో చేరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. వేమూరుకు చెందిన నేలపాటి చందు సోమవారం రాత్రి ప్రత్తిపాడు నుంచి పెదనందిపాడు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డులో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో చందుకు తీవ్రగాయాలై చెవి నుంచి రక్తస్రావం అయింది. స్థానికులు 108కు సమాచారం అందించగా, 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

చెత్త నుంచి ఎరువుల తయారీ కేంద్రం పరిశీలన



గుంటూరు రూరల్: మండలంలోని లాలుపురం గ్రామంలో చెత్త నుంచి ఎరువుల తయారీ కేంద్రాన్ని మండల ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. షెడ్‌ను పరిశీలించి ఎరువుల తయారీ, విక్రయాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శికి, క్లాప్ మిత్రలకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, క్లాప్ మిత్రలు ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సయ్యద్ జవహర్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పొదుపు పాటించడంలో సేవింగ్ బ్యాంక్ ఖాతా ప్రాముఖ్యతపై బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జవహర్ మాట్లాడుతూ ఏడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సేవింగ్స్ అవగాహన, ఆర్థిక సాక్షరతపై యూనియన్ బ్యాంక్ అధికారులు ఇంటరాక్టివ్ భాగంగా విద్యార్థుల్లో పొదుపు అలవాట్లను పెంపొందించేందుకు సేవింగ్స్ ఖాతా ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు మాట్లాడారు. పాఠశాల పూర్వ విద్యార్థి సయ్యద్ జవహర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వెంకట దుర్గాప్రసాద్, సీనియర్ మేనేజర్ హారిక బొమ్మెన, మార్కెటింగ్ ఆఫీసర్ బిస్వజిత్ పాండా, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి దేవి, సీనియర్ కోఆర్డినేటర్ దుర్గా శ్యామ్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

అరండల్‌పేట సీఐగా ఆరోగ్య రాజు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సీఐగా ఆరోగ్యరాజు ఆదివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. గుంటూరు రేంజ్ ఐజీ వద్ద పీఆర్ ఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

అందని వేతనం.. కుంటు పడుతున్న లక్ష్యం





తంగెళ్ళమూడిలో పంట కాలువలు, నీటి కుంటలు తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

నీరు గారుతున్న ఉపాధి హామీ లక్ష్యం

- ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం.. అధికారుల బాధ్యతారాహిత్యం
- మూడు నెలలు దాటినా కూలీలకు అందని వేతనాలు
- 2 నెలలుగా సిబ్బందికి చేరని వేతనాలు
- కుటుంబాలు గడవడం భారంగా మారిందంటున్న కూలీలు

పెదకాకాని: ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం.. అధికారుల బాధ్యతారాహిత్యంతో ఉపాధి హామీ లక్ష్యం రోజు రోజుకూ నీరు గారిపోతుంది. ఎప్పుడు వేతనాలు చేతికి అందుతాయోనని కూలీలు ఎదురు చూస్తున్న దుస్థితి నెలకొని ఉంది. అధికారులు, సిబ్బంది కూలీల వేతనాల వ్యవహారంపై ఎవరికి వారు దాటవేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కోసం పేదల వలసలు నివారించేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. మూడు నెలలుగా కూలీలకు, రెండు నెలలుగా సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో ఎదురు చూస్తున్నారు. దీంతో గ్రామీణ ఉపాధి హామీ చట్టం లక్ష్యం కుంటు పడుతోంది. నెలల తరబడి కూలీ చెల్లింపులు నిలిచిపోతుండటంతో వారిలో నిరుత్సాహం చోటు చేసుకుంది. రెక్కాడితే కాని డొక్కాడని కూలీలు నెలల తరబడి వేతనాల కోసం పడిగాపులు కాయటం వారికి కష్టంగా మారింది. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం అమలులో భాగంగా ఈ ఏడాది కనీస వేతనం రూ.307 చెల్లించేందుకు నిర్ణయించింది. వ్యవసాయంలో పేదలకు ఉపాధి కల్పించి వారి జీవన యాంత్రీకరణ మెరుగు పరచాలన్నది ప్రభుత్వ లక్ష్యం.



వెనిగండ్లలో మట్టి పనులు చేస్తున్న కూలీలు

మండలంలో 5,350 జాబ్ కార్డులు

పెదకాకాని మండలంలోని గ్రామాల్లో 5,350 మందికి జాబ్ కార్డులు మంజూరు చేశారు. వారిలో 940 మంది ప్రస్తుతం పనులు చేస్తున్నారు. గ్రామ సభల ద్వారా పెదకాకాని మండలంలోని 12 గ్రామాల్లో 2,875 పనులు గుర్తించి ఆ పనులకు రూ.5.25 కోట్లు నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఆయా పనులు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన కూలీలకు జాబ్ కార్డులు అందించి, పని కల్పించాలి.

- ప్రతి మూడు రోజులకు కూలీ చెల్లించాల్సి ఉండగా మూడు నెలలు దాటినా కూలీలకు వేతనాలు మంజూరు చేయలేదు. అలానే ఈ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కూడా రెండు నెలలుగా వేతనాలు అందలేదు.
- ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఏ పని ఉండదు. ఆ సమయంలో చేపట్టే ఉపాధి పనులలో పంట కాల్వలు, మురుగు కాల్వలు పూడికతీత, సీసీ రోడ్ల నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్, నూరు శాతం సబ్సిడీపై తైవాన్ జామ మొక్కలు, నిమ్మ, గులాబి, మల్లె మొక్కలు పంపిణీ వంటి పనులు చేపడతారు.
- పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదని, పలు గ్రామాల్లో మస్టర్ పనికి రాని వారికి కూడా వేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.
- గ్రామీణ ప్రాంతాలలో రెక్కాడితే కాని డొక్కాడని కూలీలే ఉపాధి హామీ పథకంలో పనిచేస్తుంటారు. వీరు ఏ పనికి వెళ్లినా సాయంత్రానికి కూలీ తెచ్చుకోవాల్సిందే. అయితే ఉపాధి హామీ పథకంలో నిబంధనల ప్రకారం ప్రతి మూడు రోజులకు చెల్లింపులు ఉంటాయి.

జనవరి నుంచి వేతనాలు పెండింగ్

ఈ ఏడాది జనవరి 18వ తేదీ నుంచి ఇప్పటి వరకు కూలీలకు చెల్లింపులు లేవు. దీంతో ఉపాధి కూలీలు తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రస్తుతం ఫామ్ పాండ్స్ (పొలాల్లో నీటి కుంటలు)కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి ఉపాధి కూలీలకు ప్రతి మూడు రోజులకు చెల్లింపులు చేస్తుంటాం. కానీ ఈ ఏడాది జనవరి 18 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. నిధులు విడుదలైన వెంటనే కూలీలకు చెల్లిస్తాం.

– టీపీ కిషోర్‌బాబు, పెదకాకాని

విద్యార్థులు క్రమశిక్షణను అలవరుచుకోవాలి

వట్టిచెరుకూరు సీఐ ఎం.రమానాయక్

ప్రత్తిపాడు: విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవరుచుకోవాలని వట్టిచెరుకూరు సీఐ ఎం.రమానాయక్ అన్నారు. మండల పరిధిలోని లేమల్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్ ఆధ్వర్యంలో పాఠశాల 97వ వార్షికోత్సవం, 7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రమానాయక్ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే తరగతి గదిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. అదేవిధంగా ఆడపిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని వివరించారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్లకు అలవాటు పడటం వలన విద్యాభ్యాసం కుంటుపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతూరి శివపార్వతి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పచ్చల ఎస్తేరురాణి, వైస్ చైర్మన్ పానుగంటి చైతన్య, ఉపాధ్యాయులు వీర్ల శ్రీనివాసరావు, మోదుగుల రవికృష్ణ, గ్రామ పెద్దలు పాతూరి కృష్ణారావు, కొణిజేటి బుల్లిబాబు, కోసూరి నాగరాజకుమారి, సామాజిక కార్యకర్త డి.చంద్రానాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ రమానాయక్, పక్కన హెచ్ఎం శ్రీధర్

ప్రొడిజి విద్యాలయంలో వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు రూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రీడలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మరక్షణ విద్యలు తదితర రంగాలపై శిక్షణను అందించేందుకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రొడిజి విద్యాలయం డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం బుడంపాడు గ్రామంలోని పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విడిదిగా 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 10.30 వరకు ఏప్రిల్ 25వ తేదీ నుంచి మే 24వ తేదీ వరకు జరుగుతాయన్నారు. బస్ సౌకర్యం కూడా కల్పించటం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 7207812001, 9573923732 నంబర్లకు ఫోన్ చేసి పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తదితరులున్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్కూల్ యాజమాన్యం

వీవీఐటీయూలో ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ఆచార్యులు జనార్ధనన్

పెదకాకాని: జాతీయ సాంకేతిక అధ్యాపకుల శిక్షణ, పరిశోధన సంస్థ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ చెన్నై) ఆచార్యులు డాక్టర్ జి.జనార్ధనన్, డాక్టర్ వి.షణ్ముగ నీధి, వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ అధ్యాపకులకు పాఠ్యాంశ రూపకల్పన, అభివృద్ధిపై మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. నంబూరు వీవీఐటీయూలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జాతీయ విద్యావిధానం 2020 దృష్టి సూత్రాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సూచనలను అనుసరించి కోర్సులను నిర్ణయించుటలో క్రమ బద్ధమైన పద్ధతులపై అవగాహన పెంపొందించారు. ఈ సదస్సులో డాక్టర్ జి.జనార్దనన్ మాట్లాడుతూ ప్రస్తుతం వీవీఐటీ విశ్వవిద్యాలయంతో కలసి పనిచేసేందుకు రూపొందించిన ఒప్పందం ప్రకారం చెన్నై ఎన్ఐటీటీఆర్, గుణాత్మక అభివృద్ధి దిశగా ఒక వర్ధమాన విశ్వవిద్యాయలంగా తీర్చిదిద్దేందుకు, దాని ఫలితంపై ఆధారపడే విద్యను అందించేందుకు, పలు అధ్యయనాలపై ఆధారపడుతూ వాటిని సంపూర్ణంగా సమన్వయ పరుస్తూ, విశ్వవ్యాప్త బోధనా పరమైన ప్రమాణాలను నెలకొల్పుతామని వివరించారు. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో రూపొందించబడు ప్రతి కోర్సుకు ల్యాబొరేటరీని అనుసంధానించవలసినదిగా సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వీవీఐటీయూలో ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో అధ్యాపకులు

విశ్వవిద్యాలయాల్లో వేడుకలు సిగ్గుచేటు

ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ గంగాధర్

పెదకాకాని: విశ్వవిద్యాలయాను నడిపించాల్సిన ఇన్‌చార్జి ఉప కులపతులు, రిజిస్ట్రార్ల చేతుల మీదుగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఏబీవీపీ కన్వీనర్ కురుమళ్ల గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడూ విద్యా, సాంస్కృతిక, క్రీడా అభివృద్ధికి కేంద్ర బిందువులై ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు రాజకీయ నాయకుల వ్యక్తిగత వేడుకలకు వేదికలుగా మారుతుండటం విచాకరమని తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రాజకీయ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం బాధాకరమని చెప్పారు. విద్యార్థులపై రాజకీయ ప్రభావం చూపించేలా జరుగుతున్న ఈ చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదగినవి కావని స్పష్టం చేశారు. యూనివర్సిటీ ప్రాంగణాల్లో ఇటువంటి రాజకీయ ప్రదర్శనలు పునరావృతమైతే, విద్యార్థి శక్తి తీవ్రస్థాయిలో స్పందించక తప్పదని ఆయన హెచ్చరించారు. యూనివర్సిటీల వీసీలు, అధికారులు మారాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ప్రేక్షక పాత్ర పోషించడం సరికాదని తెలిపారు. చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న యూనివర్సిటీ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గంగాధర్ డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో బిహార్ వాసి దుర్మరణం



ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో బిహార్ వాసి దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బిహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా బుసారిచతౌనా గ్రామానికి చెందిన రామ్ విలాస్ రాయ్ అతని సోదరుడు రామ్ బినోద్ రాయ్‌లు మరికొందరితో కలిసి పది సంవత్సరాల కిందట బతుకుదెరువు కోసం గుంటూరు జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం గ్రామంలోని కారం మిల్లుల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం రామ్ బినోద్ రాయ్ అతని సోదరుడు రామ్ విలాస్ రాయ్ మరో వ్యక్తి నితీష్‌కుమార్‌తో కలిసి సరుకులు తెచ్చుకునేందుకు పల్నాడు జిల్లా బోయపాలెంకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. సరుకులు తీసుకుని తిరిగి ఈదులపాలెం బయల్దేరారు. రామ్ బినోద్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సమీపంలోని దర్గా వద్ద బైక్ స్కిడ్ అయ్యి అదుపు తప్పింది. దీంతో రామ్ బినోద్‌రాయ్‌కు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు సోదరుడు రామ్ విలాస్ రాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపారు.

మే ఒకటి నుంచి భారతీయ విద్యాభవన్‌లో వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి నెల రోజులపాటు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి పి.రామచంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ కళల్లో నైపుణ్యత అవసరమని, విద్యాసంవత్సరం పొడవునా నిరంతరం చదువు పేరుతో మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులకు లలిత కళలు, సంగీతం, భరత నాట్యం, కూచిపూడి నృత్యంతో పాటు వెస్ట్రన్ డాన్స్, చెస్, బాస్కెట్ బాల్ వంటి ఆటల పోటీలతో పాటు పెయింటింగ్, యోగా, వ్యాయామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణ శిబిరంలో ప్రముఖ సంగీత, నాట్య కళాకారులు, క్రీడా నిపుణులచే ఐదేళ్లు నిండిన బాల, బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా భారతీయ విద్యాభవన్ పాఠశాలతో పాటు 9124519444, 9908520110 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి



గుంటూరు మెడికల్: ఏప్రిల్ 21 వచ్చిన కాంట్రాక్టు ఉద్యోగులకు ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1న కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు విజయబాబు, ప్రసాదరావు, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, కోశాధికారి శ్రీనివాస్, నగరశాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, జాన్, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.

తొలగని ముసుగు..!



దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగువేసి ఉన్న ఈ చిత్రాన్ని చూడండి. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా అధికారులు ముసుగులు వేశారు. ఎన్నికలు పూర్తయ్యాక కోడ్ ఎత్తివేస్తున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించినప్పటికీ వైఎస్సార్ విగ్రహానికి ఉన్న ముసుగు మాత్రం తొలగలేదు. పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం మెయిన్ రోడ్డులో కనిపించింది ఈ చిత్రం. కాగా ఇదే గ్రామంలో ఉన్న ఇతర రాజకీయ నాయకుల విగ్రహాల ముసుగులు మాత్రం ఎప్పుడో తొలగిపోయాయి.

– ప్రత్తిపాడు

తల్లీబిడ్డలు పోషకాహారం తీసుకోవాలి

ప్రత్తిపాడు: తల్లీబిడ్డలు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏ హేమంత్ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం గొట్టిపాడు, యనమదల, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గొట్టిపాడు డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలన్న అంశంపై పోషకాహార ప్రదర్శనను చేపట్టారు. హాజరైన డాక్టర్ ఏ హేమంత్ గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆహారం, తల్లిపాల వలన బిడ్డకు కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నిర్మల, హెచ్‌వీ విజయకుమారి, ఏఎన్ఎం కళాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.ద్వారక, పి.కుసుమ, ఎం.దేవిక, పి.అక్కమ్మ, టి.వెంకటరమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ఈదులపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ ట్రాకర్ యాప్‌లో స్వీయ నమోదు ప్రక్రియపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు రోజారాణి, యు.జ్యోతి, వెంకటరత్నం, బ్రహ్మమ్మ, ఉదయకుమారి, శివకుమారి పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్

లో ఓల్టేజీ సమస్య.. తప్పని ఇక్కట్లు

- 27వ వార్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

పొన్నూరు: పట్టణంలోని 27వ వార్డులో లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొంతకాలంగా వార్డులో విద్యుత్ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పలుసార్లు విద్యుత్ కార్యాలయంలో సమస్యపై వినతిపత్రాలు అందజేసినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వార్డులోని న్యాయవాది రాధిక కార్యాలయం పక్క వీధిలో సుమారు 15 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీధిలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాల నుంచి సింగిల్ ఫేజ్ ద్వారా నివాసాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే 3 ఫేజ్ లైను లేని కారణంగా అదనపు భారం పడినప్పుడు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కూడా ఏర్పడి ఇళ్లలో ఫ్యూజులు, వైర్లు కాలిపోతున్నాయని వాపోతున్నారు. వేసవికాలం దృష్ట్యా ఏసీల వినియోగం పెరగడంతో వాటికి సరపడా విద్యుత్ సరఫరా జరగడం లేదని అంటున్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా, సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



సింగిల్ ఫేజ్ సరఫరా అవుతున్న విద్యుత్ స్తంభం

సమస్యను పట్టించుకోవడం లేదు



ఎన్నో నెలల నుంచి స్థానికంగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. వీధిలో సింగిల్ లైను ఉండటం వలన వినియోగం పెరిగినపుడు విద్యుత్ అంతరాయం కలుగుతోంది. షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు కాలిపోతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.

– షేక్ గౌసియా, స్థానికురాలు

సాయిబాబా మందిరంలో వార్షికోత్సవ పూజలు

పెదకాకాని: సాయిబాబా మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని బాబా ఆలయంలో 9వ వార్షిక వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ప్రజలు అధిక సంఖ్యలో సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు బాబా వారికి పాలు, పూలు, పండ్లతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆలయ నిర్వాహకులు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రత్తిపాడు: ఆకలితో ఇబ్బంది పడుతున్న ఒంటరి కుటుంబాలను ఫౌండేషన్ తరపున దత్తత తీసుకోవడం జరుగుతుందని హోప్ ఫౌండేషన్ నిర్వాహకుడు గంగిశెట్టి వెంకట్ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో సోమవారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకలితో ఇబ్బంది పడుతున్న ఒంటరి కుటుంబాలను ఫౌండేషన్ తరపున దత్తత తీసుకొని ప్రతి నెల వారికి నిత్యావసరాలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని సరుకులు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా ఇల్లు కోల్పోయిన ఓ వికలాంగునికి రూ.36 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు అల్లం దశరథ రామయ్య, పఠాన్ బాజి, దరిమడుగుల బాలసాయి, లక్కాకుల బాజి పాల్గొన్నారు.